# ప్రజాశక్తి



శనివారం 30 డిసెంబర్ 2023 | 5 | విజయనగరం


## ఉద్యోగులే ఆడుకున్నారు..!

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నల్లబెల్లి, వీలుపర్తి సచివాలయ పరిధిలో శనివారం ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రీడల నిర్వహణకు రూ.10 వేలను సచివాలయానికి ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ ఆటల పోటీలకు గ్రామస్తులెవరూ రాలేదు. దీంతో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, సర్పంచ్ ఆటలాడేశారు. ఇలాంటి కార్యక్రమం వల్ల ప్రజాధనం దుబారా తప్ప ప్రయోజనం ఏమిటని గ్రామస్తులు ముక్కున వేలేసుకుంటున్నారు.



బ్యాడ్మింటన్ ఆడుతున్న సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు

## రంగుమారిన ధాన్యం నూరు శాతం కొనుగోలు

- పండగలోపే పంటనష్ట పరిహారం
- పిఆర్ బొబ్బిలి ఇఇ సరెండర్‌కు ఆదేశం
- జెడ్‌పి సర్వసభ్య సమావేశంలో మంత్రి బొత్స
- రూ.1045 కోట్లతో జెడ్‌పి బడ్జెట్‌కు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఉమ్మడి జిల్లాలో రంగుమారిన ప్రతి ధాన్యపు గింజా కొనుగోలు చేయాలని జిల్లాకు చెందిన విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అధికారులను ఆదేశించారు. ఇటీవల తుపాను సందర్భంగా నష్టపోయిన రైతులకు సంక్రాంతి పండగ లోపే ప్రభుత్వం నష్టపరిహారం చెల్లిస్తుందని వివరించారు. పనిలో తీవ్ర అలసత్వం ప్రదర్శించిన పిఆర్ బొబ్బిలి ఇఇని వెంటనే సరెండర్ చేయాలని మంత్రి బొత్స కలెక్టర్‌కు ఆదేశాలు జారీచేశారు. రంగు మారిన ధాన్యం ఎన్ని ఎకరాల్లో ఉండవచ్చు అన్న ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోవడంతో విజయనగరం జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విటి రామారావుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.1045 కోట్లతో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ప్రవేశపెట్టిన బడ్జెట్‌కు సమావేశం ఏకగ్రీవం ఆమోదం తెలిపింది.

జెడ్‌పి చైర్మన్ అధ్యక్షతన శుక్రవారం సర్వ సభ్య సమావేశం, దీనికి ముందుకు బడ్జెట్ సమావేశం జరిగాయి. సమావేశంలో తొలుత వ్యవసాయం, సివిఎల్ సప్లై విభాగాలపై చర్చసాగింది. పాచిపెంట మండలం విశ్వనాథపురానికి చెందిన ఓ రైతు ధాన్యం రంగు మారినందున అధికారులు తక్కుధరకు కొనుగోలు చేశారని, ప్రభుత్వం మాత్రం వాస్తవ ధర కల్పిస్తున్నట్టు చెబుతోందని సభ దృష్టికి తీసుకొచ్చారు. రైతులు ట్రాన్స్‌పోర్టు సమస్య కూడా ఎదుర్కొంటున్నారని డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి బొత్స రంగుమారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడంతోపాటు తగ్గింపు లేకుండా చెల్లింస్తుందని, అందుకనుగుణంగానే అధికారులు సేకరించాలని సూచించారు. ఆన్‌లైన్ విధానం వల్ల ధాన్యం మిల్లర్లకు కేటాయింపులో జాప్యం జరుగుతోందని, ఫలితంగా ఇటు మిల్లర్లు ఇచ్చిన బ్యాంకు గ్యారంటీలకు అనుగుణంగా పని ఉండడం లేదని, అటు రైతులు కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందా? లేదా? అన్న సందేహంలో పడుతున్నారని పలువురు జెడ్‌పి సభ్యులు, ఎమ్మెల్యేలు అన్నారు. ఈనేపథ్యంలో ఆఫ్ లైన్ విధానం ద్వారా మిల్లులకు ధాన్యం కేటాయించాలని చేసిన విజ్ఞప్తి మేరకు మంత్రి బొత్స అందుకనుగుణంగా ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం డిఆర్‌డిఎ కార్యకలాపాలపై చర్చనడుస్తుండగా వచ్చే నెలలో పింఛన్లు, చేయూత కార్యక్రమాల నిర్వహణపై మంత్రి సుమారు గంటపాటు అధికారులు, ప్రజాప్రతినిధులకు దిశానిర్దేశం చేశారు. జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ నిధులతో నిర్మిస్తున్న సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వెల్ నెస్ కేంద్రాల భవనాలను వచ్చే రెండు నెలల్లో పూర్తిచేయాలని ఇంజినీరింగ్ అధికారులను మంత్రి ఆదేశించారు. ఉపాధిహామీ కన్వర్జెన్స్ నిధులతో చేపట్టిన పనులకు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన అదనపు అంచనా వ్యయాన్ని చెల్లించేందుకు బొబ్బిలి పంచాయతీరాజ్ ఇఇ నిరాకరిస్తున్నారని తెర్లాం ఎంపిపి ఉమాదేవి ప్రస్తావించారు. ఆ డివిజన్‌లోని ఇతర ప్రజాప్రతినిధులు కూడా అసహనం వ్యక్తం చేయడంతో ఇఇ శ్రీనివాసరావు సరెండర్‌కు మంత్రి బొత్స ఆదేశాలు జారీచేశారు. సమావేశంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, శాసనసభ్యులు బొత్స అప్పలనరసయ్య, అలజంగి జోగారావు, శంబంగి వెంకట చినప్పలనాయుడు, శాసన మండలి సభ్యులు రఘురాజు, రఘువర్మ, జెడ్పీ సి.ఇ.ఓ. రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు



మెడకు ఉరితాడు బిగించుకుని నిరసన వ్యక్తం చేస్తున్న నెల్లిమర్ల నగర పంచాయతీ కార్మికులు

## మెడకు ఉరితాళ్లతో నిరసనలు

### నాలుగో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 4వ రోజుకు చేరింది. విజయనగరం కార్పొరేషన్ కార్యాలయం వద్ద కార్మికులు మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్రావు, సిఐటియు నగర కార్యదర్శి బి.రమణ, యూనియన్ నాయకులు బి. భాస్కరరావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల కాళ్లు కడిగి ఆ నీళ్లు నెత్తిన జల్లుకున్న మీ రుణం తీర్చుకోలేనని, లక్ష రూపాయలు జీతం ఇచ్చినా తక్కువే అని, 3 నెలల్లో మన ప్రభుత్వం వస్తుంది, అందర్నీ పర్మినెంట్ చేస్తామన్న ముఖ్యమంత్రి మాట మార్చి అప్కాస్‌లో చేర్చి శాశ్వత బానిసలుగా చేసి నేడు ఉరి తాడు బిగించారని ఆందోళన వ్యక్తం చేశారు.

**నెల్లిమర్ల :** సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీ కార్మికులు వినూత్న రీతిలో ఉరేసుకుని నిరసన తెలిపారు. శుక్ర వారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన చేపట్టిన సమ్మె శిబిరం శుక్రవారం నాలుగో రోజుకు చేరింది. ఈ సందర్భంగా కార్మికులు మెడకు ఉరితాళ్లు బిగించుకుని నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు కిల్లంపల్లి రామారావు, ఫెడరేషన్ నాయకులు టి.బాబూరావు, బి.హరిబాబు, జె.శ్రీను, బి.రాము, టి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**బొబ్బిలి :** పట్టణంలో మున్సిపల్ కార్మికులు సమ్మె శిబిరంలో వినూత్నరీతిలో మెడకు ఉరితాళ్లు వేసుకుని నిరసన తెలిపారు. ఎన్నికల హామీ ప్రకారం కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్షులు గౌరీష్, నాయకులు వాసు, యుగంధర్, కార్మికులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహానికి వినతి అందిస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

### అంబేద్కర్ విగ్రహానికి

## సమగ్ర శిక్ష ఉద్యోగుల వినతి

- 10వ రోజుకు చేరుకున్న సమ్మె
- మద్దతు తెలిపిన టిడిపి జిల్లా అధ్యక్షులు నాగార్జున

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిఎం జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన సమ్మె శుక్రవారం నాటికి 11వ రోజుకు చేరుకుంది. సమ్మె సందర్భంగా కలెక్టరేట్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి వినతి అందజేశారు. ఈ సందర్భంగా సమగ్రశిక్ష జెఎసి జిల్లా అధ్యక్షులు అధ్యక్షులు గురువులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతుంటే సమస్యలు పరిష్కారం చేయకుండా నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. మరోవైపు కెజిబివి ఉద్యోగులకు మెమోలు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. బెదిరింపులకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కరించేవరకు సమ్మె విరమించేది లేదని అన్నారు. సమ్మెకు టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున, సిఐటియు నాయకులు టివి రమణ, ఎపి అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు మద్దతు తెలిపారు. నాగార్జున మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే ఉద్యోగులు సమస్యలు పరిష్కారం చేసి సమ్మె ను విరమింప చేయాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు టిడిపి మండల అధ్యక్షులు బొద్దల నర్సింగరావు తదితరులు ఉన్నారు.

### జాబ్‌మేళాకు 73 మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాకు 73 మంది నిరుద్యోగ యువత హాజరైనట్టు జిల్లా ఉపాధి అధికారి డి.అరుణ తెలిపారు. ఈ మేళాలో రిలయన్స్ జియో సంస్థ ప్రతినిధులు పాల్గొని తదుపరి దశ కోసం 27 మందిని ఎంపిక చేసినట్టు వెల్లడించారు. రిలయన్స్ బ్రాంచ్ మేనేజర్ రామచంద్ర, అసిస్టెంట్ మేనేజర్ సూరిబాబు ఎంపిక ప్రక్రియ లో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

## గడ్డి తిని బతకాలా..?

### సిఎం జగన్‌ను ప్రశ్నించిన అంగన్‌వాడీలు ● జిల్లా అంతటా వినూత్న నిరసనలు

ప్రజాశక్తి-బొబ్బిలి

**రోజంతా కష్టపడినా ప్రభుత్వం ఇస్తున్న అరకొర జీతంతో గడ్డి తిని బతకాలా? అంటూ అంగన్‌వాడీలు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. తమ సమస్యలు పరిష్కరించాలని, పనికి తగ్గ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె శుక్రవారం 18వ రోజుకు చేరుకుంది.**

బొబ్బిలి పట్టణంలో సమ్మె శిబిరంలో అంగన్వాడీలు వినూత్నరీతిలో గడ్డి తింటూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కామేశ్వరి, ఉమాగౌరి, అనురాధ, నిర్మల, పద్మ పాల్గొన్నారు.

**విజయనగరం టౌన్ :** సమ్మెలో భాగంగా కలెక్టరేట్ ఎదుట సమ్మె శిబిరంలో పచ్చ గడ్డి తింటూ అంగన్వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, నాయకులు సుశీల, రాధ, ఉష మాట్లాడారు. సమస్యలు పరిష్కారం చేయకుంటే తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

**గంట్యాడ :** సమ్మెలో భాగంగా గంట్యాడలో నోట్లో గడ్డి పెట్టుకుని అంగన్వాడీలు నిరసన తెలిపారు. డిమాండ్లను పరిష్కరించే వరకూ పోరాటం సాగిస్తామని నినాదాలు చేశారు.

**రామభద్రపురం :** ఆర్‌టిసి కాంప్లెక్సు ఎదురుగా అంగన్వాడీలు చేపడుతున్న దీక్షా శిబిరాన్ని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన సందర్శించి, మద్దతు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కార్యవర్గ సభ్యులు చింతల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు మడక తిరుపతిరావు, సర్పంచ్ రవ్వ ఈశ్వరరావు, సిఐటియు మండల కార్యదర్శి బలసా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**గజపతినగరం :** గజపతినగరంలో అంగన్వాడీలు పచ్చి గడ్డి తింటూ నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సుభాషిని, పి.జ్యోతి, సెక్టార్ లీడర్లు డి.నాగమణి, వాణి, నారాయణమ్మ, సన్యాసమ్మ, సుజాత పాల్గొన్నారు.

**శృంగవరపుకోట :** పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయానికి ఎదురుగా చేపట్టిన సమ్మె శిబిరంలో అంగన్వాడీలు ఉరివేసుకుని నిరసన తెలిపారు. అంగన్వాడీలకు పంచాయతీ పారిశుధ్య కార్మికులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ, నాయకులు చెలికాని ముత్యాలు, అంగన్వాడీ యూనియన్ నాయకులు జె.లలిత, డి.శ్యామల పాల్గొన్నారు.

**జామి :** జామిలో సమ్మె శిబిరంలో అంగన్వాడీలు పచ్చ గడ్డి తింటూ నిరసన తెలిపారు. అంగన్వాడీలకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు గాడి అప్పారావు సంఘీభావం తెలిపారు.

అంగన్వాడీల సమ్మె శిబిరాన్ని గజపతినగరం మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు సందర్శించి, మద్దతు తెలిపారు. ఆయన వెంట టిడిపి మండల నాయకులు స్వామినాయుడు, సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

**కొత్తవలస :** ఎంపిడిఒ కార్యాలయం వద్ద అంగన్వాడీలు రిలే దీక్షలు 18వ రోజు కొనసాగించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గాడి అప్పారావు, అంగన్వాడీ యూనియన్ నాయకులు కాకర తులసి, శంకరావతి, తదితరులు పాల్గొన్నారు.



బొబ్బిలిలో గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు, సిఐటియు నాయకులు

### పూనకాలతో హోరెత్తించిన అంగన్వాడీలు

ప్రజాశక్తి-భోగాపురం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు చేపట్టిన సమ్మె 18వ రోజుకు చేరింది. సమ్మెలో భాగంగా శుక్రవారం భోగాపురంలో అమ్మవారి పూనకాలతో హోరెత్తించారు. వినూత్నరీతిలో వేప, మామిడి కొమ్మలతో అమ్మవారికి పూజలు చేస్తూ ప్రభుత్వానికి మంచిబుద్ధి ప్రసాదించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి బి.సూర్యనారాయణ, అంగన్వాడీ యూనియన్ నాయకులు కృష్ణవేణి, కొర్లమ్మ, అనిత, శ్రీదేవి, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.







రామభద్రపురం .. అంగన్వాడీలకు మద్దతుగా సమ్మె శిబిరంలో కూర్చున్న టిడిపి నేత బేబినాయన ; గజపతినగరం.. గడ్డి తింటూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు ; భోగాపురం.. వేప, మామిడి ఆకులతో అమ్మవారికి పూజలు చేస్తూ నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

## హామీల అమల్లో సిఎం 85 శాతం ఫెయిల్

### పోస్టర్ విడుదల చేసిన టిడిపి నాయకులు



పోస్టర్ విడుదల చేస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం కోట


ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలోను, పాదయాత్ర సమయంలోను ఇచ్చిన హామీలను నియోజకవర్గాలు, మండల, జిల్లా స్థాయిలో హామీలు నెరవేర్చడంలో 85శాతం ఫెయిల్ అయ్యారని టిడిపి విజయనగరం పార్లమెంట్ స్థానం అధ్యక్షులు కిమిడి నాగార్జున అన్నారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆ పార్టీ జిల్లా కార్యాలయం అశోక్‌బంగ్లాలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు, అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నో హామీలు ఇచ్చారని, వాటిలో ఎన్ని అమలు చేశారో చూస్తే 85శాతం ఫెయిల్ అయ్యారని అన్నారు. రాష్ట్రంలోను, జిల్లా, మండల, గ్రామ స్థాయిలో కలిపి పాదయాత్ర సమయంలో 730 హామీలు ఇచ్చారని, అందులో పూర్తిగా అమలు చేసినవి 21 (3శాతం), పాక్షికంగా అమలు చేసిన హామీలు 88 (12శాతం) మాత్రమేనని వివరించారు. 109 హామీలు మాత్రమే అమలు చేసి మిగిలిన 621 హామీలు అమలు చేయలేదన్నారు. ఆడుదాం ఆంధ్ర పేరుతో చేస్తున్న క్రీడల్లో వయసు పైబడిన వారు పాల్గొంటున్నారని, వారందరికీ దెబ్బలు తగలకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కనకల మురళీమోహన్, కోండ్రు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## 35,205 మందికి విద్యా దీవెన

### రూ.23.28 కోట్ల లబ్ధి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

జిల్లాలో జగనన్న విద్యా దీవెన పథకం కింద 35,205 మంది విద్యార్థులకు రూ.23.28 కోట్ల లబ్ధి చేకూరింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం బహిరంగ సభ నుంచి శుక్రవారం జగనన్న విద్యా దీవెన పథకం కింద జూలై, సెప్టెంబర్ - 2023 త్రైమాసికానికి సంబంధించి నిధులను బటన్ నొక్కి తల్లులు, విద్యార్థుల జాయింట్ ఖాతాల్లోని బటన్ నొక్కి జమ చేశారు. కలెక్టరేట్ విసి హాల్ నుంచి ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ అనిత, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి రామానందం, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చంద్ర శేఖర్ తదితరులు వీక్షించారు. అనంతరం లబ్ధిదారులకు మెగా చెక్కును అందించారు.




జెవిడి చెక్కును అందజేస్తున్న డిఆర్‌ఒ అనిత

### విలువలు గురించి జగన్‌రెడ్డి మాట్లాడడం సిగ్గుచేటు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తండ్రి శవం వద్ద సంతకాల సేకరణ చేసిన జగన్ రెడ్డి రాజకీయ విలువలు గురించి మాట్లాడడం సిగ్గుచేటని జనసేన నాయకులు గురాన అయ్యలు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యాదీవెన సభలో పవన్ కళ్యాణ్‌పై జగన్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ప్రతీ సభలో పవన్ కళ్యాణ్ పెళ్లిళ్ల గురించి మాట్లాడడం దౌర్భాగ్యమన్నారు. తన కుటుంబంలో చెల్లి, బాబాయి, తాత, ముత్తాతలకు జరిగిన పెళ్లిళ్ల గురించి జగన్‌రెడ్డి ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తన కష్టార్జితంతో పార్టీని నడుపుతూ నిస్వార్థంగా రాజకీయాలు చేస్తున్నారన్నారు. జనసేన, టీడీపీ పొత్తును ప్రజలు ఆహ్వానిస్తున్నారన్నారు. రానున్న రాజకీయ సునామీలో వైసిపి ఆనవాలు లేకుండా కొట్టుకుపోవడం ఖాయమన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com





# క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకే..

## కమిషనర్ శ్రీరాములునాయుడు

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

యువతలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడమే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్ శ్రీరాములనాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 14వ డివిజన్ 17వ సచివాలయ పరిధిలో ఆనందోత్సాహాల నడుమ క్రీడా పోటీలు జరిగాయి. బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడా పోటీల్లో యువకులు తమ క్రీడా ప్రతిభను చాటారు. ఆయా క్రీడలను ముందుగా కమిషనర్ శ్రీరాములనాయుడు, ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీ రాముల నాయుడు మాట్లాడుతూ సచివాలయ పరిధిలో గెలుపొందిన విజేతలు మండల స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. అక్కడి నుంచి జిల్లా స్థాయికి ఎంపిక చేసి పోటీలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డివిజన్ వైసిపి నాయకులు, మహిళలు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.

**పాఠశాలను పరిశీలించిన కమిషనర్**

నగరంలోని 14వ డివిజన్ స్వామి వివేకానంద ప్రాథమిక పాఠశాలను కమిషనర్ శ్రీరాముల నాయుడు శుక్రవారం సందర్శించారు. విద్యా బోధన, సదుపాయాలను చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి చేపట్టిన చర్యలపై ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్ వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతల సహాయంతో శీతలీకరణ యంత్రాలు, ఇతర మౌలిక సదుపాయాలు సంపూర్ణంగా ఉన్నాయని, అందుకు కృషి చేసిన ఫ్లోర్ లీడర్ ఎస్‌వివి రాజేష్‌ను అభినందిస్తున్నామని అన్నారు.

# వెయిట్ లిఫ్టింగ్‌లో సత్తాచాటిన నీరజ

**ప్రజాశక్తి-నెల్లిమర్ల**



కాంస్య పతకం సాధించిన నీరజ

జాతీయ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని కొండవెలగాడకు చెందిన క్రీడాకారిణి నీరజ ప్రతిభ కనబర్చి కాంస్య పతకం సాధించింది. శుక్రవారం అరుణాచల్ ప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యునివర్సిటీలో జరిగిన జాతీయ స్థాయి మెన్, ఉమెన్ యూత్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో బి.నీరజ 40 కిలోల విభాగంలో సత్తాచాటింది. నీరజను జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బి.లక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వెంకటరామయ్య, కోచ్ చల్లా రాము అభినందించారు.

# వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టాలి

## ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

**ప్రజాశక్తి-బొండపల్లి**

బొండపల్లి ఎస్‌సి కాలనీలో అర్ధాంతరంగా నిలిచిన రక్షిత మంచినీటి పథకం ట్యాంకు నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలని రాష్ట్ర ఎస్‌సి కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్... ఎస్‌సి కార్పొరేషన్ సభ్యులు ఎస్.జయమణికి స్పష్టంచేశారు. శుక్రవారం ఆ కాలనీలో జయమణి, వైసిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు పీరుబండి జైహింద్ కుమార్‌తో కలిసి మహిళలతో మాట్లాడి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌సి కాలనీకి చాలా ఏళ్ల నుంచి తాగునీటి సమస్య ఉందని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అదనంగా వాటర్ ట్యాంకు మంజూరు చేసిందని మహిళలు తెలిపారు. కొంతమంది స్వార్థపరులు రాజకీయ రంగు పులిమి ట్యాంకు నిర్మాణాన్ని నిలిపేసేందుకు కుట్ర పన్నుతున్నారని జయమణి దృష్టికి తీసుకొచ్చారు. మహిళల గోడు విన్న జయమణి వెంటనే స్పందించి ఎస్‌సి కమిషన్ చైర్మన్ ప్రసాద్ దృష్టికి ఫోన్ ద్వారా తీసుకెళ్లారు. స్పందించిన ఆయన ట్యాంకు నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఎస్.జయమణికి సూచించారు. ఈ విషయంపై జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడుతానని ఆయన హామీఇచ్చారు. సమావేశంలో వైస్ ఎంపిపి గొండెల ఈశ్వరరావు, సర్పంచ్ బొండపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# సక్రమంగా పారిశుధ్య నిర్వహణ

**ప్రజాశక్తి-బొబ్బిలి**

మున్సిపాలిటీలో పారిశుధ్య పనులు సక్రమంగా నిర్వహించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని జెండా వీధి, కోరాడవీధి, దక్షిణదేవిడి, మార్కెట్ ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండటంతో పర్మినెంట్ కార్మికులు సక్రమంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ, రోడ్లు, కాలువలు శుభ్రం చేయాలన్నారు. ప్రతిరోజూ చెత్త సేకరణ సాధ్యం కాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు. ఆయనతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివ, తదితరులు ఉన్నారు.


# నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

**ప్రజాశక్తి-వంగర**

విద్యుత్తు సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా శనివారం ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ వినయ్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# ఎ.రావివలసలో గడపగడపకు..

**ప్రజాశక్తి-భోగాపురం**



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యే బడ్డుకొండ

మండలంలోని అమటాం రావివలస సచివాలయ పరిధిలో సర్పంచ్ ఉప్పాడ శివారెడ్డి ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలు తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రీ అమలు చేయని పథకాలు మన రాష్ట్రంలోనే అమలవుతున్నాయని చెప్పారు. ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా బలపడాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పథకాలను మీ ఇంటి వద్దకే చేరవేరుస్తున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, సవరపల్లి సర్పంచ్ ఉప్పాడ విజయ భాస్కర్ రెడ్డి, తహశీల్దార్ బంగార్రాజు, ఎంపిడిఒ అప్పలనాయుడు, నాయకులు సుందర హరీష్, ఎ.పైడినాయుడు, అధికారులు పాల్గొన్నారు.

# 'సీతం'లో ముగిసిన శిక్షణ

**ప్రజాశక్తి-విజయనగరం**

స్థానిక గాజులరేగ పరిధిలోగల సీతం ఇంజినీరింగ్ కళాశాలలో పెస్ట్ కంట్రోల్ మేనేజ్మెంట్‌పై ఎన్ఐపిహెచ్ఎమ్ ఆధ్వర్యంలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం విశాఖకు చెందిన డికెఎస్ గ్రూప్ ఆఫ్ కంపెనీ నిర్వహించింది. శిక్షణలో సత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు 50 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.మల్లారెడ్డి, డాక్టర్ పి.శక్తివేల్, కె.వినోద్ కుమార్, డి. ప్రకాష్ రావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమం లో సత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ్ రావు,సత్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సాయిదేవమణి, సీతం ప్రిన్సిపాల్ డాక్టర్ డివి రామమూర్తి, లెఫ్టినెంట్ మజ్జి వరలక్ష్మి, జెఎస్. శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

# కేబుల్ ఆపరేటర్ల సమస్యలు పరిష్కరించాలి

**ప్రజాశక్తి-నెల్లిమర్ల**

కేబుల్ ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఎపి కేబుల్ ఆపరేటర్ల జెఎసి రాష్ట్ర అధ్యక్షులు ఎ.నారాయణరావు, జిల్లా నాయకులు బి.స్వామినాయుడు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక పూడమ్మతల్లి గుడి వద్ద నియోజకవర్గ స్థాయిలో కేబుల్ ఆపరేటర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ప్రజలకు సమాచారం అందించడంలో ఆపరేటర్లు చురుకైన పాత్ర పోషించారన్నారు. కోవిడ్ తరువాత తమ పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. ప్రభుత్వ నిబంధనలు, కార్పొరేట్ ఆపరేటర్ల తీరుతో అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వినియోగదారులు రీఛార్జి చేసుకోకపోతే తమ ఖాతాల్లోంచి నగదు ఉపసంహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లాకు చెందిన కార్పొరేట్, ప్రయివేటు ఆపరేటర్లు తీరు మార్చుకోవాలని హితవు పలికారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు రాము, సురేష్, జగన్నాథం, లక్ష్మణరావు, రామదాసు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఉచిత వైద్య శిబిరం

**ప్రజాశక్తి-రేగిడి**

మండలంలోని ఉంగరాడమెట్ట సమీపంలోని జ్యూట్ ఫ్యాక్టరీ ఆవరణలో పాలకొండ శ్రీ విజయ హాస్పిటల్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ దూబ పద్మావతి ఒక ప్రకటనలో తెలిపారు. రోగులకు ఇసిజి, బిపి, షుగర్ పరీక్షలతోపాటు 14 ఏళ్లలోపు పిల్లలకు హిమోగ్లోబిన్ పరీక్షలు, ఆరోగ్యశ్రీ సేవలు ఉంటాయని చెప్పారు. అవసరమైన రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సమస్యలు సృష్టించే వారిని గుర్తించండి

## పోలీసు అధికారులకు ఎస్‌పి ఆదేశం

**ప్రజాశక్తి-విజయనగరం**

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ సమస్యలను సృష్టించే వారిని గుర్తించాలని ఎస్‌పి ఎం.దీపిక పోలీసు అధికారులను ఆదేశించారు. సమిష్టి కృషి, సమన్వయంతో పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. వార్షిక నేర సమీక్షా సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పోలీసుల సమిష్టి కషి ఫలితంగా గత ఏడాది కంటే పలు నేరాల సంఖ్య తగ్గిందన్నారు.
ముందస్తు సమాచారంతో పేకాట, కోడి పందాలు, బెల్టు షాపులపైన, గంజాయి, మద్యం, నాటుసారా అక్రమ రవాణను నియంత్రించామన్నారు. ఇదే స్ఫూర్తిని రాబోయే రోజుల్లో కూడా చూపి, శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. తుపాకుల లైసెన్సులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, వాటిని రెవెన్యూ రికార్డులతో సరిపోల్చాలన్నారు. క్షేత్ర స్థాయిలో సమస్యలు సష్టించే వ్యక్తులను గుర్తించి, మంచి ప్రవర్తనకు వారిని బైండోవర్ చేయాలన్నారు. సమాచార వ్యవస్థను మెరుగుపర్చుకోవాలని, గ్రామస్థాయిలో సమాచారం దత్తత పోలీసులు, స్టేషనుకు చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల దృష్ట్యా క్షేత్ర స్థాయిలో చెక్ పోస్టుల ఏర్పాటుకు అవరమైన ప్రాంతాలను గుర్తించాలన్నారు. గంజాయి, నాటుసారా అక్రమ రవాణకు పాల్పడే వ్యక్తులను గుర్తించి, వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. నేర సమీక్షా సమావేశంలో ఎస్ఐబి అదనపు ఎస్‌పి ఎస్.వెంకటరావు, డిఎస్‌పిలు, సిఐలు, తదితరులు పాల్గొన్నారు.

# గురజాడ విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

అంతర్జాతీయ ఇంగ్లీష్ ఒలింపియాడ్ పరీక్షల్లో గురజాడ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. డి.వైష్ణవి, కె.లహరి, జి.లాస్య, వై.తేజశ్వని, జి.లివియాగ్రెస్ గోల్డ్ మెడల్ంప సాధించారు. విద్యార్దులను పాఠశాల కరస్పాండెంట్ ఎం స్వరూప, హెచ్ఎం పూడి.శేఖర్ అభినందించారు.

# జీవనోపాధులపై అవగాహన

**ప్రజాశక్తి-వంగర**

మహిళల ఆర్థిక పరిపుష్టే ధ్యేయమని ఎపిడి సావిత్రి, ఏరియా కోఆర్డినేటర్ చిరంజీవి అన్నారు. ఈ మేరకు మండలంలోని తలగాంలో మహిళా సంఘాల జీవనోపాధులకు సంబంధించి టైలరింగ్, పుట్టగొడుగుల పెంపకం, అగరబత్తీలు, డెయిరీ, తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలను మహిళా సంఘాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శశిభూషణరావు, ఎపిఎం చక్రపాణి, ఎస్ఎస్ మేనేజరు సుదర్శన్ రావు, ఎఫ్‌పిఒ ఎపిఎం మంగమ్మ, సిసిలు పాల్గొన్నారు.

# కొత్త విషయాలు నేర్చుకోవాలి

## సెంచూరియన్ విసి ప్రశాంత్

**ప్రజాశక్తి-నెల్లిమర్ల**

విద్యార్థులు ఎప్పటికప్పుడు కొత్త విషయాలను నేర్చుకుంటూ తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత్‌కుమార్ మహంతి పిలుపునిచ్చారు. ఇటీవల సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్ల శిక్షణ పొందిన నిజామాబాద్‌కు చెందిన టెమ్రిస్ మూడో బ్యాచ్ విద్యార్థులకు శుక్రవారం విసి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృత్తి సంబంధమైన కొత్త విషయాలను ఎప్పటికప్పుడు నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భం గా ఇటీవల విద్యార్థులు శిక్షణలో నేర్చుకున్న విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్. ఆచార్యులు, ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు, డీన్ డాక్టర్ సన్నీ డయోల్, డీన్ ప్రొఫెసర్ మురళీ, అనస్తీషియా విభాగాధిపతి కె.వెంకట కళ్యాణ్, అసిస్టెంట్ ప్రొఫెసర్ చైతన్య, డాక్టర్ పుష్పలత, అసోసియేట్ ప్రొఫెసర్ నాగ జోగయ్య, టెమ్రీస్ కో-ఆర్డినేటర్ ఎన్.సాయి కుమార్ పాల్గొన్నారు.

# చేనేత సమస్యలపై వినతి

**ప్రజాశక్తి - పూసపాటిరేగ**

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడును దేవాంగుల సాధికార సమితి సభ్యులు కొండపల్లి లక్ష్మణరావు కోరారు. శుక్రవారం మంగళగిరిలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో చేనేత సామాజిక తరగతుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. బిసి ఫెడరేషన్ అధ్యక్షులు కొల్లు రవీంద్ర, మాజీమంత్రి నిమ్మల కిష్టప్ప, చేనేత సాధికార సమితి సభ్యులు ఎన్.భాస్కరరావు, వీరభద్రరావు, తిప్పాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

నగరంలోని 7, 8,19 డివిజన్లలో వివిధ అభివృద్ధి పనులకు మేయర్ విజయలక్ష్మి శంకుస్థాపన చేశారు. శుక్రవారం దాసన్నపేటలోని కాళీమాత ఆలయం వద్ద రహదారి నిర్మాణానికి, దక్షిణ గట్టు ప్రాంతంలో కాలువలకు, లంకాపట్నంలోని రహదారుల పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకు అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో ఆయన సూచనలు సలహాలతో నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. రూ.56.19 లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశామన్నారు. 7వ డివిజన్ కార్పొరేటర్ పి. మాలతి మాట్లాడుతూ ఎన్నడూ లేని విధంగా తమ డివిజన్ అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమాల్లో జోనల్ ఇన్‌ఛార్జి కోలగట్ల కృష్ణారావు, రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, స్థానిక నాయకులు పొట్నూరు శ్రీనివాసరావు, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.

# హ్యాక్‌థాన్-2023లో లెండి విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి-డెంకాడ**

చత్తీస్‌గడ్ రాష్ట్రం దుర్గ్‌లోని బిలాయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్-2023లో లెండి కళాశాల ఇసిఇ, సిఎస్ఎస్ఇ విద్యార్థి బృందం సత్తాచాటింది. పి.ధన్యశ్రీ నేతృత్వంలో వి.సాయికృష్ణ, ఎస్.శాంతికుమారి, పి.నరసింహ, ఎస్.శ్రీను, పి.వివేక్ బృందం విజేతలుగా నిలిచి, మొదటి బహుమతిని, రూ.లక్ష నగదు బహుమతిని గెలుచుకుంది. మెంటర్ ఎస్.సురేష్ కుమార్, డాక్టర్ ఎ.వి.పరాంకుశం, సంబంధిత విభాగాధిపతులు, డాక్టర్ ఎం.రాజన్‌బాబు, డాక్టర్ ఆర్.రాజేందర్ ప్రోత్సాహంతో పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపల్ తమ్మినేని హరిబాబు అభినందించారు.

# సేవాదల్ వందేళ్ల ఉత్సవాల్లో డోల

**ప్రజాశక్తి-విజయనగరం కోట**

కాంగ్రెస్ పార్టీ సేవాదల్ స్థాపించి వందేళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం కాకినాడలో నిర్వహించిన కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి డోల శ్రీనివాస్ పాల్గొన్నారు. అక్కడ గాంధీ పార్క్ వద్ద ఆయన విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం అక్కడి నుంచి 5 కిలోమీటర్లు కాలినడకన సేవాదళ్ నాయకులతో కలిసి పార్టీ కార్యాలయానికి చేరుకొని వందేళ్ల ఉత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా ఆయన అన్నారు. కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, సిడబ్ల్యుసి సభ్యులు పల్లంరాజు, విజయనగరం నాయకులు జమ్ము ఆదినారాయణ పాల్గొన్నారని తెలిపారు.

# విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

**ప్రజాశక్తి-విజయనగరం కోట**

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవడంతో పాటు సమాజంలో మార్పు తెచ్చే విద్యార్థులుగా తయారుకావాలని వెంకటపద్మ ఫౌండేషన్ చైర్మన్, రోటరీ క్లబ్ ఎలక్ట్ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరావు తెలిపారు. గురువారం మరిచర్ల జెడ్‌పి హైస్కూల్‌లో లీడ్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను ఎంపిక చేసి వారిలో దేశం పట్ల, సమాజం పట్ల, విద్యపరంగా స్ఫూర్తిని నింపే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీ పతి రాజు, సూర్యలక్ష్మి, ఉమా దేవి, తదితరులు పాల్గొన్నారు.